



రెబ్బెన మండలంలో వాగులో తోడుతున్న ఇసుక (ఫైల్)

ఇసుకను తోడేస్తున్నారు..

- యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా
- చిన్నచిన్న వాగులు, వంకలనూ వదలని మాఫియా
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- మామూళ్ల మత్తులో అధికారులు

ఆసిఫాబాద్, మే 22: జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఫలితంగా వాగులు, వంకలన్నీ వట్టిపోయి భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. జిల్లాలో ఎలాంటి ఇసుక రీచ్‌లు లేక పోయినా ట్రాక్టర్ల యజమానులు నామమాత్రంగా పర్మిట్‌లు తీసుకుంటూ ఒక్కో పర్మిట్‌పై పదేసి ట్రిప్పుల చొప్పున ఇసుకను తరలిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాల వ్యవహారంలో తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు రెవెన్యూ, పోలీసుల పాత్ర అపరిమితంగా ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా ట్రాక్టర్ యజమానుల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.2వేల చొప్పున వసూలు చేస్తూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా జిల్లా కేంద్రంతో సహా 15మండలాల్లోనూ ఇంచుమించు ఇదే తరహాలో మాఫియా దర్జాగా ఇసుక దోపిడీకి పాల్పడుతోంది. నిర్మాణ రంగం ఊపందుకుంటున్న పరిస్థితుల్లో ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో వ్యవసాయ అవసరాల కోసం వినియోగించాల్సిన ట్రాక్టర్‌లను సైతం ఇసుక దందాకే వినియోగించడం పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోందని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా నుంచి పొరుగు జిల్లాలకు ఇసుక అక్రమంగా రవాణా అవుతున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజా ప్రతినిధులు మండిపడటం ఇందుకు నిదర్శనం.

జిల్లాలో యథేచ్ఛగా అక్రమ ఇసుక దందా..

జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో ఇసుక స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా అధికారుల అండదండలు ఈ అక్రమ వ్యాపారం వెనక పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా ఆసిఫాబాద్ పట్టణశివారులోని పెద్దవాగు మొదలుకుని దహెగాం మండలంలోని ఎర్రవాగు వరకు నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న ఇసుక చోరులు మాఫీయాను తలదన్నే రీతిలో ఏకంగా ఎక్స్‌కావేటర్‌లు, డోజర్లు వంటి యంత్ర సామగ్రిని ఉపయోగించి మరీ ఇసుక వ్యాపారానికి తెరలేపడం అధికారుల పనితీరును ప్రశ్నార్థకంగా మార్చి వేసింది. వాస్తవానికి జిల్లాలో అధికారికంగా ఎలాంటి ఇసుక రీచ్‌లు గుర్తించలేదు. కానీ జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా ఉన్న వాగులు, వంకల ద్వారా ఉన్నా పోగయ్యే స్వల్ప పరిమాణం ఇసుక మేటలను కూడా వ్యాపారులు తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ, భూగర్భ జలవనరులశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. మార్కెట్‌లో ప్రస్తుతం టన్ను ఇసుకకు రూ.2000నుంచి రూ.2500 వరకు ధర పలుకుతోంది.

నిబంధనల ప్రకారం లారీలలో ఇసుక తరలించరాదన్న ఆదేశాల దృష్ట్యా అక్రమ ఇసుక తవ్వకం దారులు వ్యూహాత్మకంగా రూట్ మార్చి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రహస్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న డంప్‌లకు తరలించి అక్కడి నుంచి లారీల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా జిల్లాలో రెబ్బెన మండలంలోని గంగాపూర్, పులికుంట, కొండపల్లి వాగులతో పాటు దహెగాం మండలంలోని కల్వాడ ఎర్రవాగు, పెద్దవాగు, కౌటాల మండలంలోని ముత్తంపేట, తాటిపల్లి వాగులు, చింతలమానేపల్లి మండలంలోని రుద్రాపూర్, చింతలమానేపల్లి, కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి, పెద్దవాగు, కెరమెరి మండలంలోని సాంగ్వీ, ఖైరి వాగు, సిర్పూర్(టి) మండలంలోని పెద్దబండ వాగుల నుంచి ఇసుక మాఫియా పెద్దఎత్తున ఇసుకను వెలికి తీస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారమంతా సంబంధిత తహసీల్దార్‌లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు తెలిసినప్పటికీ ఇసుక సిండికేట్లు ముట్ట చెప్పే మామూళ్లకు ఆశపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పనితీరుపై ఆరోపణలు ఎక్కువ అయిన సమయాల్లో మాత్రం ఒకటి రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు చెబుతున్నారు.

భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం..

జిల్లా భౌగోళికంగా అనేక వైరుధ్యాలతో కూడుకొని ఉన్న ప్రాంతం కావడంతో జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల స్థితి అసమతుల్యంగా ఉంటుంది. వర్షాకాలంలో పుష్కలంగా కనిపించే భూగర్భజలాలు ఎండాకాలంలో పాతాళానికి చేరుతూ ఏటా మనుషులకే కాకుండా పశుపక్షాదులు, జంతువులకు తాగునీటి సమస్య ఉత్పన్నం కావడం ఇక్కడ సర్వసాధారణం. నందేట్లో నడేమియాలా వాగులు వంకల్లో అడ్డగోలుగా సాగుతున్న ఇసుక తవ్వకాల మూలంగా ఉన్న కొద్దిపాటి భూగర్భజలాల మట్టం కూడా దారుణంగా పడిపోతున్నట్లు భూగర్భ జలవనరుల శాఖ సేకరించిన సర్వేల్లో వెల్లడైంది. ముఖ్యంగా వాగులు, ఒర్రెలు ప్రవహిస్తున్న పరిసరాల్లో భూగర్భ జలాలపై ఇసుక తవ్వకాలు తీవ్రప్రభావం చూపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, గూడాల్లో తీవ్ర తాగునీటి సంక్షోభం తలెత్తుతున్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం నదులు, ఉపనదుల్లోనే మీటర్ లోతుకు మించి ఇసుక తవ్వకాలు జరపడం నిషేధం. వాల్టా చట్టాన్ని అనుసరించి వాగులు, వంకల్లో అసలు ఇసుక తీయరాదు. కానీ జిల్లాలో అడుగడుగున నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమంగా ఇసుక దందా సాగుతుండడంతో భూగర్భ జలాలపై తీవ్రప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల వల్ల నీటి వనరులన్నీ కూడా అవిరైపోయి వన్యప్రాణులకు తాగునీరు లభించని పరిస్థితి ఉత్పన్నం అవుతోంది. దీంతో నీటి కోసం అటవీ జంతువులు కాస్త గ్రామాలపై పడి రైతుల ఆస్థి, ప్రాణనష్టాలకు కారణంగా నిలుస్తున్నాయి.



ఆసిఫాబాద్ పెద్దవాగులో ట్రాక్టర్‌లలో నింపుతున్న ఇసుక (ఫైల్)

ప్రతికేసును పారదర్శకంగా విచారించాలి

- ఎస్పీ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, మే 22: ప్రతి కేసులో సాక్ష్యాలను సేకరించి పారదర్శకంగా విచారించాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో సర్కిల్‌వారీగా నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీవిత్తనాలను విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పోలీసు స్టేషన్లలో నమోదైన ప్రతికేసులో సాక్ష్యాలను సేకరించి పకడ్బందీగా విచారణ చేపట్టాలన్నారు. నమోదైన కేసుల్లో కొన్ని యూఐలో ఉండటానికి కారణాలను పరిశీలించారు. యూఐ కేసులకు అవసరమైన డీఎన్ఏ, ఎఫ్ఎస్ఎల్ మెడికల్ రిపోర్టులను పెండింగ్ ఉంచకుండా వెంటనే కోర్టులో చార్జ్‌షీట్ వేయాలని సూచించారు. కేసుల విచారణలో అవసరమైన క్లూస్‌ను సేకరించాలని ఆదేశించారు. మిస్సింగ్ ప్రాపర్టీ, రోడ్డు ప్రమాదాల కేసుల ఫైల్స్‌ను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు స్టేషన్‌ల వారీగా ప్రతికేసు ఫైల్‌ను పరిశీలించి వాటికి అవసరమైన సూచనలు చేశారు. సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను తెలియజేసి గ్రామాలు, పట్టణాల్లో వాటిని ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలు, సైబర్‌నేరాలు, డ్రగ్స్ కేసులలో కమ్యూనిటీ ప్రోగ్రాంలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి ఫ్రీజ్ అయిన ఖాతాల్లో ఉన్న నగదును పుట్ ఆన్ హోల్డ్‌లో ఉంచి కోర్టు అనుమతి ద్వారా బాధితులకు అందజేయాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. రోజు వారిగా సిబ్బంది విధులను రికార్డ్ చేసే జనరల్ డైరీని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు..

వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తారని, వాటిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్త వ్యవహరించాలన్నారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా నకిలీ విత్తనాలు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీ చేయడం, మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలని తెలియజేశారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల విధుల్లో ఉత్తమ ప్రతిభకబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందజేవారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేష్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య, కెరమెరి ఎస్సై విజయ్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు, ఆర్ఐలు, డీసీఆర్బీ, ఐటీ విభాగాలు ఎస్సైలు, డీపీవో సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష మెజార్టీతో గెలుపు ఖాయం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

ఆసిఫాబాద్, మే 22: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో లక్ష మెజార్టీతో తన గెలుపు ఖాయమని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల తరువాత మొట్ట మొదటిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన జడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రజలు సుస్థిర ప్రభుత్వాన్ని కోరుకున్నారని, దీంతో పల్లె పట్టణంతోపాటు సామాజికవర్గాలు తేడా లేకుండా అందరు బీజేపీకి ఓటు వేశారన్నారు. తెలంగాణలో 10స్థానాలు రావడం ఖాయమని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన అయిదు విడతల్లో 300సీట్లు సాధించడం ఖాయమన్నారు. బీజేపీకి ఓటువేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ అరిగెలనాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు కోట్నాకవిజయ్, విశాల్, పెంటయ్య, విలాస్‌తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, వైద్య సిబ్బంది

ఆసిఫాబాద్, మే 22: జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను వెంటనే ఇవ్వాలని బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు అశోక్, షకీల్, సాయిప్రసాద్, ప్రవీణ్, మమత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టెక్ట్స్ బుక్స్ రైటర్‌గా సనుగోజు సతీష్

ఆసిఫాబాద్, మే 22: తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ హైదరాబాద్ నిర్వహించే వర్క్‌షాప్‌నకు తెలంగాణ మోడల్‌స్కూల్ ఆసిఫాబాద్‌కు చెందిన బయోలజీ టీచర్ సనుగోజు సతీష్ జిల్లా తరఫున ఎంపిక య్యారు. హైస్కూల్ జీవశాస్త్ర టెక్ట్స్‌బుక్, అకాడమిక్ స్టాండర్డ్స్‌తో కూడిన క్వశ్చన్ బ్యాంకు తయారీకోసం ఈనెల 23నుంచి 27వరకు నిర్వహించే వర్క్ షాప్‌లో పాల్గొని పుస్తకం రూపొందించనున్నారు.



సనుగోజు సతీష్

ఐటీడీఏ ఉద్యాన నర్సరీల అభివృద్ధికి కృషి

- పీవో ఖుష్బూ గుప్తా



నర్సరీని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

కాగజ్‌నగర్, మే 22: ఐటీడీఏ ఉద్యాన నర్సరీలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. బుధవారం జంబుగలోని ఐటీడీఏ ఉద్యాననర్సరీ, శిక్షణకేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నర్సరీ ద్వారా మెరుగైన ఆదాయం పొందటంతో పాటు గిరిజన రైతులకు, దినసరి కూలీలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని ఉద్యానఅధికారి సందిప్‌కుమార్‌కు సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. అలాగే రైతులకు ఆదాయం వచ్చే పంటలపై శిక్షణ కార్యక్రమాలు ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి సందీప్‌కుమార్, సుదీర్‌కుమార్, సిబ్బంది సాయిరాజ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ పూర్ణిమ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

సిర్పూర్(టి), మే 22: మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులోని బుద్ధుడి విగ్రహం వద్ద గురువారం నిర్వ హించే బుద్ధ పూర్ణిమ కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు దళితసంఘం నాయ కులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బుద్ధుడి విగ్రహం చుట్టు పక్కల నీళ్లు ఉండడం వల్ల ఇక్కడ పూజలు నిర్వహించి అంబేద్కర్ భవనంలో అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు. అయనవెంట నాయకులు విశ్వనాథ్, తులసీరాం, రాజు, కోఆప్షన్ సభ్యుడు కీజన్ హుస్సేన్, జునేద్ అహ్మద్, ఇఫ్తుస్సేన్, ఉమాజీ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి

చింతలమానేపల్లి, మే 22: నకిలీ పత్తి విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఈవోలు అన్నారు. బుధవారం మండలంలోని ఖర్జవెల్లి, గంగాపూర్, చింతలమానేపల్లి, గూడెంగ్రామాల్లో రైతులకు అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా నకిలీ పత్తి విత్త నాల పట్ల అప్రమత్తంగా ఉండడంతోపాటు లైసెన్సు కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు హెప్సిబా, విజయ్, కృపామణి, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సిర్పూర్(టి)లో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సిర్పూర్(టి), మే 22: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్నివసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం మండలంలోని లోనవెల్లి, దుబ్బగూడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తెచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించాలన్నారు. రైతులకు కొనుగోలుకేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అదనపుకలెక్టర్ దీపక్ తివారితో కలిసి మండలంలోని అచ్చెల్లి, పెద్దబండ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి ఎండలు అధికంగా ఉండడంతో మొక్కలు ఎండిపోకుండా నీరు పోయాలన్నారు. మండలకేంద్రంలో ఈవిద్యా సంవత్సరం విద్యార్థులకు అందించే యూనిఫాం కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. డ్వాక్రా సంఘాల మహిళలు పాఠశాలల పునఃప్రారంభంలోగా యూనిఫాంలు కుట్టి ఇవ్వాలని అన్నారు. ఒక జతకు రూ.50 ఇస్తామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై ఎంఈవోను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట డీఈవో అశోక్, డీఎల్‌పీవో, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ కిరణ్, ఏపీఎం దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలి

కాగజ్‌నగర్: విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలం పర్ధానగూడలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు ముగిసేలోగా పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా, ఫ్యాన్స్, మరమ్మతు పనులును వేగవంతం చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో ఎలాంటి చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. అనంతరం పట్టణంలోని సంఘం బస్తీలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, ఆర్డీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో పర్ధాన్‌గూడ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో తుకారాం భట్

కెరమెరి, మే 22: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో తుకారాం భట్ అన్నారు. బుధవారం ఆయన కెరమెరి పీహెచ్‌సీతో పాటు గోయగాం పల్లె దవాఖానను తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందే సమయం ప్రారంభమైందన్నారు. అలాగే వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యం తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట వైద్యాధికారి క్రాంతి కిరణ్, దివ్య తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం భట్



గనులపై మౌలిక వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, మే 22: గనులపై కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆర్కే5గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో ప్రస్తుతం యువ కార్మికులు అధికసంఖ్యలో ఉన్నారని, వారికి రెస్ట్‌హాల్స్, సైకిల్‌షెడ్స్, భోజనశాలలు ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన పనిముట్లు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ లోన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సర్వేఆఫ్ అయిన ఎస్‌డీఎల్ యంత్రాల స్థానంలో నూతన యంత్రాలు ప్రవేశపెట్టాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పక నెర వేరుస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఏరియాకార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, బద్రిబుచ్చయ్య, పిట్‌కార్యదర్శులు గునిగంటి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా చూసుకోండి



మాట్లాడుతున్న డైరెక్టర్

శ్రీరాంపూర్, మే 22: రాబోయే వర్షాకాలంలో బొగ్గుఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్అండ్ ప్రాజెక్ట్) జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఏరియాజీఎం బిసంజీవరెడ్డితో కలిసి శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శిచారు. పనిప్రదేశాలను పరిశీలించి మాట్లాడుతూ, త్వరలో వానాకాలం రాబోతోందని, సంపు ఏరియాల్లో ఉన్నబొగ్గును ముందస్తుగా వెలికియాలన్నారు. వెనువెంటనే రవాణా కూడాచేయాలని సూచించారు. 2024-25ఆర్థిక సంవత్సరంలో ఏరియాకుఇచ్చిన బొగ్గుఉత్పత్తిలక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. ఇందుకు ఉద్యోగులు ఒకప్రణాళికతో ముందుకు పోవాలన్నారు. ఓబీ కాంట్రాక్టర్లు తమరోజువారీ ఉత్పత్తిలక్ష్యాన్ని తప్పనిసరిగా చేరుకోవాలన్నారు. సంస్థఉద్యోగుల రక్షణకు ప్రాధాన్యతిస్తుందని, ఇప్పటి వరకు ఎన్నో సంక్షేమకార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల పీవోలు ఎం శ్రీనివాస్, టి శ్రీనివాస్, మేనేజర్లు రవికుమార్, బ్రహ్మాజీరావు, సర్వే అధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

డాటా డిజిటలైజేషన్ త్వరగా పూర్తి చేయాలి..

సింగరేణి ఉద్యోగులకు సంబంధిం చిన డాటా డిజిటలైజేషన్ త్వరగా పూర్తిచేయాలని డైరెక్టర్(ఆపరేషన్స్‌పా) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) జి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం వారు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. పర్సనల్, ఎస్టేట్స్, ఫైనాన్స్, వృత్తిశిక్షణ కేంద్రాలపై సమీక్షించారు. డిజిటలైజేషన్‌తో ఉద్యో గులకు సంబంధించిన వివరాలు తెలుస్తాయన్నారు. క్వార్టర్స్ అలాట్‌మెంట్, సింగరేణి భూములు, కోర్టు కేసులు, ఇతర అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. దీనిద్వారా అన్ని రకాల సేవలు ఉద్యోగులకు సత్వరమే అందుతాయని వివరించారు. సమావేశంలో శ్రీరాంపూర్, ఆర్జీ-1 ఏరియాల జీఎంలు బి సంజీవరెడ్డి, చింతలశ్రీనివాస్, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, వీటీసీ మేనేజర్ రామారావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

మందమర్రిటౌన్, మే 22 : మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. బుధవారం స్థానిక పాలచెట్టు ఏరియా సమీపం లో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సాక్షులను విచారించారు. సారంగపల్లి గ్రామానికి చెందిన అక్కపాక శంకర్, చంద్రకళ పాల చెట్టు ఏరియాలో గొడవపడినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. శంకర్‌ను చంద్రకళ కులం పేరుతో దూషించడంతో శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయగా ఏసీపీ రవికుమార్ సాక్షులను విచారించారని, సాక్షుల తెలిపిన వివరాల అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

న్యాయ నిర్ణేతగా అర్హత సాధించిన జైచంద్రప్రసాద్

బెల్లంపల్లి, మే 22: తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 21 వరకు గద్వాల పట్టణంలో నిర్వహించిన జాతీయ న్యాయ నిర్ణేతల సెమినా ర్‌కి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పది మంది సభ్యులు పాల్గొన్నారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చి రామారావు, మాస్టర్ జిల్లాపల్లి వెంకటస్వామి బుధవారం తెలిపారు. వీరిలో నుంచి 8మ ంది అర్హత సాధించగా ఇందులో తైక్వాండో జాతీయ న్యాయ నిర్ణేతగా చిన్న వయస్కుడైన 12 సంవత్సరాల జిల్లపల్లి జైచంద్ర ప్రసాద్ అర్హత సాధించి రికార్డు సృష్టించాడన్నారు. అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజులాల్, రాజ్ మహ్మద్, బుగ్గ ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి, మాజీ సర్పంచు స్వరూపలు అభినందించారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న జీఎం మనోహర్ దంపతులు

మందమర్రిటౌన్, మే 22: వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం రాత్రి పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో రథోత్సవం నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరాలయం నుంచి మార్కెట్ గుండా రథోత్సవం కొనసాగింది. స్వామి వారి కీర్తనలు ఆలపిస్తూ రథోత్సవం నిర్వహించారు. ఏరియా జీఎం మనోహర్ దంపతులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయప్రధాన అర్చకులు అనంతాచార్యులు పాల్గొన్నారు.



మందమర్రిలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా నర్సింహస్వామి కల్యాణం

కొడిమ్యాల, మే 22: మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నర్సింహస్వామి జయంతిని పురస్కరించుకొని బుధవారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాదం వితరణతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, యాగ్నికుడు శ్రీనాథచార్యులు, పాల్గొన్నారు.

బీర్‌పూర్ బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కొండపైన ఉన్నా శ్రీలక్ష్మీ నరసింహాని ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని అర్చకులు అత్యంత నిష్ట నియమాలతో వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించగా భక్తులు స్వామి వారిని దర్శించకున్నారు. సాయంకాల సమయంలో స్థంబ ఆవిర్భావ పూజలను ఘనంగా నిర్వహించారు.

భాగ్యరెడ్డి వర్మ కృషి చిరస్మరణీయం



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మే 22: దళిత వైతాళికుడు, సంఘసంస్కర్త అయిన భాగ్యరెడ్డి వర్మ దళిత బాలికల విద్యకు చేసిన కృషి అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ మోతిలాల్, షెడ్యూల్డు కులాల ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలను తొలగించి దళిత బాలికలకు విద్యను అందించేందుకు 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి బాలికల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అనిత, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్: పట్టణంలోని ఉత్కూరులోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ సంఘం నాయకులు దళిత చైతన్య వైతాళికుడు భాగ్యారెడ్డి వర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘం పట్టణాధ్యక్షుడు తొగరు రాజు, మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న, నాయకులు రమేష్, మొగిలి, చిన్న, సునీల్, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, మే 22 : గోవాలోని యూనివర్శల్ 369 షోటోకన్ కరాటే ఆర్గనైజేష్ ఆఫ్ ఇండియా పోటీల్లో మంచిర్యాలకు చెందిన కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చగా బుధవారం వారిని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జెన్‌శిటో రియు కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

దండేపల్లి, మే 22: అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న చిన్నారులకు పోషకాహారం అందించాలని లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో ఎం రేష్మా అన్నారు. బుధవారం దండేపల్లి మండలం తానిమడుగు, కుందేళ్లపహాడ్ గిరిజన గ్రామాలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ల, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

హాజీపూర్, మే 22: నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, నాటిన మొక్కలకు నీరు పోయాలని ఎంపీడీవో మధుసూదన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రోడ్లపై చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ. 300 వచ్చే విధంగా పనులను కల్పించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఎంపీవో, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు

హాజీపూర్, మే 22: అప్రకటిత విద్యుత్ కోతలతో మండలంలోని ముల్కల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజుల నుంచి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. విద్యుత్ కోతలపై విద్యుత్ అధికారులను అడిగితే స్పందించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు విద్యుత్ కోతలకు కారణాలు చెప్పకుండా ఫోన్‌లు స్విచాఫ్ చేసుకుంటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. రెండు రోజుల నుంచి గంట, 2 గంటలు కూడా విద్యుత్ ఉండడం లేదు. విద్యుత్ లేకపోవడంతో తాగునీటికి, ఇతర అవసరాలకు నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిరంతరం విద్యుత్ అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్యం నెరవేరేనా?

- మొక్కల పెంపకంపై సిబ్బంది నిర్లక్ష్యం

- జూలైలో నాటాలని అధికారుల నిర్ణయం

నస్పూర్, మే 22: వర్షకాలంలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంపు కోసం సీసీసీ రెండో వార్డులో నర్సరీలో మొక్కల పెంపకం హరితహారం లక్ష్యం నెరవేరేలా కనిపించడంలేదు. వర్షాలు కురువగానే జూలైలో ఇంటింటికి పూల, పండ్ల, నీడనిచ్చే ఆరు మొక్కలను పంపిణీ చేస్తారు. కానీ ఈ ఏడాదిలో ఇప్పుడే పాలిథిన్ కవర్లతో మట్టి నింపి విత్తనాలు నాటే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ఇప్పటికే విత్తనాలు నాటి మొక్కలు ఎదగాలి ఉండగా నిర్లక్ష్యం కారణంగా విత్తనాలు నాటే ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో జూలై మాసంలో హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధం కావడం కష్టంగా కనిపిస్తోంది. సీసీసీ లక్ష్మీనగర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలో వివిధ రకాల పండ్ల, పూల, నీడనిచ్చే మొక్కల పెంపకం చేపట్టారు. హరితహారంకు లక్ష 40 వేల మొక్కలను ప్రజలకు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. కాగా లక్ష్యం అనుకున్న సమయానికి చేరుకునే పరిస్థితులు కనిపించడంలేదు. గతేడాదిలో ప్రజలకు పంపిణీ చేయగా పండ్ల, పూల మొక్కలు దాదాపు 25 వేల వరకు మిగిలిన ఉన్నాయి. మిగిలిన మొక్కలను వేసవి ఎండల నుంచి కాపాడేందుకు నీడ కోసం గ్రీన్ పరదా ఏర్పాటు చేయాల్సిఉండగా ఆ పనులు ఇప్పుడు మొదలు పెట్టారు. లక్షల రూపాయల గ్రీన్ బడ్జెట్ కింద ఖర్చు చేస్తున్నప్పటికీ లక్ష్య సాధనలు నిర్లక్ష్యం జరుగుతుందనే ఆరోపణలున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



లక్ష్యం మేరకు మొక్కల పంపిణీ..

హరితహారం కార్యక్రమం నాటికి పండ్ల, పూల, నీడనిచ్చే మొ క్కలను పంపిణీ చేస్తాం. హరితహారం లక్ష్యం కచ్చితంగా చేరుకుంటాం. నర్సరీలో పనులు వేగవంతం చేస్తాం.

- సతీష్, మున్సిపల్ కమిషనర్


నర్సరీలో విత్తనాలు నాటడానికి సిద్ధంగా ఉన్న సంచులు

పనులను వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

మందమర్రిరూరల్, మే 22: పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ సూచించారు. బుధవారం మండలంలోని సారంగపల్లి, చిర్రకుంట గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరి నాటికి మరమ్మత్తులు పూర్తయ్యే విధంగా కృషి చేయాలన్నారు. పనులు నాణ్యతగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేశ్వర్, ఐకేపీ ఏపీఎం లలితకుమారి తదితరులు ఉన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంలు కుడుతున్న కుట్టు కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం నాటికి యూనిఫాంలు కుట్టడం పూర్తి చేయాలని సూచించారు.

లక్షెట్టిపేటరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని డీఈవో యాదయ్య ఆదేశించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, బలరావుపేట, మోదెల, గాంధీనగర్ పాఠశాలలను ఆయన సందర్శించారు. పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. అనంతరం చందారం, జెండా వెంకటాపూర్ పాఠశాలల్లో కుట్టు మిషన్ ద్వారా కుడుతున్న యూనిఫామ్‌లను పరిశీలించారు. నిర్ణీత సమయంలో అందించాలని ఆదేశించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి చౌదరి, ఏఈ కార్తీకరెడ్డి, సీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

జన్నారం, మే 22: జన్నారంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలో బుధవారం జీలుగ విత్తనాలను వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు కొనుగోలు చేయాలని సూచించారు.

మహిళల ఆందోళన

జన్నారం, మే 22 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో తీవ్ర నీటి ఎత్తడి తలెత్తిందని, సమస్య పరిష్కరించాలని మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. గ్రామ కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి నీటి ఎద్దడి లేకఉండా చూడాలని రవి, లక్ష్మీ, శ్రీలత, నాగలక్ష్మీ, రాజలింగు కోరారు.

ముఖ్యమంత్రి నిర్ణయం హర్షణీయం

జన్నారం, మే 22 : జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ నాయకులు బాలసాని శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సంవత్సరాలుగా జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలని పోరాటాలు చేశామని, తమను గుర్తించిన సీఎం పేరు పెట్టడం ఆనందంగా ఉందని తెలిపారు.

క్రికెట్ కిట్ అందజేత

దండేపల్లి, మే 22: దండేపల్లి మండల తాళ్ళపేట గ్రామానికి చెందిన ముస్లిం యువజన క్రీడాకారులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్ క్రికెట్ కిట్‌ను యవకులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాదిక్, నజీర్, జాఫర్‌ఖాన్, కాంతరావు, నర్సయ్య, స్వామి, చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

'ధాన్యం తూకంలో మోసాలు'

చెన్నూరు, మే 22: మండలంలోని దుగ్నేపల్లి గ్రామంలోని డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బంది తూకంలో అవకతవకలకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపించారు. బుధవారం పలువురు మాట్లాడుతూ కాంటాలో కిలో మైనస్ పెట్టి చూపిస్తున్నారని, అదే వేరే కేంద్రం దగ్గరి కాంటాను తీసుకువచ్చి బస్తాను పెడితే కిలో ఎక్కువ చూపుతుందని తెలిపారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

వడదెబ్బతో ఒకరి మృతి

బెల్లంపల్లి, మే 22: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో బుధవారం వడదెబ్బతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఖమన గ్రామానికి చెందిన దాసరి భీంరావు(50) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా బెల్లంపల్లిలో పని లేకుండా తిరుగుతున్నాడు. బుధవారం ఎండ తీవ్రతకు పాఠశాల సమీపంలో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గొడుగులు పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, మే 22 : మంచిర్యాల పట్టణంలోని చిరు వ్యాపారులు, రోడ్ల పక్కన కూరగాయలు విక్రయించే వారికి జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి, సీనియర్ లైన్‌మెంబర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని గొడుగులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్, మే 22: రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న సుమారు 16 మంది సేల్ పికింగ్ కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని బుధవారం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సీహెచ్ పీఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం మాట్లాడుతూ ఐదు నెల లుగా వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. కాంట్రాక్టర్ బిల్లు పెట్టకుండా వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ బిల్లులు పెట్టినా యాజమాన్యం సరైన సమయంలో బిల్లులు వేయడం లేదన్నారు. ఎన్నికల కోడ్ వల్ల లాభాలు ఏమి లేవని నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రతి నెల 7వ తేదీ లోపు వేతనాల చెల్లిం చాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రావు, శ్రీనివాస్, బైరి మల్లేష్, కార్తిక్, సింగతి సతీష్, ఎస్ కిష్టయ్య, రంజిత్, అప్పారావు పాల్గొన్నారు.

70కిలోల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత



పట్టుకున్న నకిలీ విత్తనాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చింతలమానేపల్లి, మే 22: మండలంలోని గూడెం గ్రామం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న 70కిలోల నకిలీపత్తివిత్తనాలను బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి మండలం గూడెంగ్రామం మీదుగా మహారాష్ట్రకు నకిలీ పత్తివిత్తనాలు తీసుకెళ్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు గూడెం గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి పోలీసులను గమనించి తన వద్ద ఉన్న రెండు సంచుల పత్తివిత్తనాలు కిందపడేసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతన్ని పట్టుకుని విచారించగా తనపేరు చాపిలే వినోద్ అని పేర్కొన్నాడు. గంగాపూర్ గ్రామానికి చెందిన చాపిలే పురుషోత్తం, సిర్పూర్(టి) మండలం భూపాలపట్నంకు చెందిన బొల్లబోయిన అశోక్, బొల్లబోయిన కృష్ణ సూచన మేరకు విత్తనాలు తరలిస్తున్నట్లు తెలిపాడు. ఈ మేరకు విత్త నాలను స్వాధీనపర్చుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విత్తనాలను స్వాధీనపర్చుకుని వారిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై వెంకటేష్, కానిస్టేబుళ్లు మధు, రమేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండ వేడిమితో చేపల మృత్యువాత


కౌటాల మండలం మొగడ్‌దగడ్ చెరువులో మృతిచెందిన చేపలు

కౌటాల, మే 22: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామ శివారులోని చెరువులో ఎండవేడిమితో చేపలు మృత్యువాతపడ్డాయి. లక్షరూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఎర్మసుధాకర్ తెలిపాడు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరాడు.

చెరువులో విషప్రయోగం.. చనిపోయిన చేపలు

బెజ్జూరు, మే 22: గుర్తుతెలియని వ్యక్తులు విష ప్రయోగానికి పాల్పడడంతో చెరువులో చేపలన్నీ మృత్యువాతపడ్డాయి. మండలంలోని అందుగులగూడ గ్రామ సమీపంలోని మహిళలమ్మ చెరువులో గ్రామానికి చెందిన తలండి బలరాం అనే వ్యక్తి చేపల పెంపకంతో ఉపాధి పొందుతున్నాడు. రెండురోజుల క్రితం గుర్తు తెలి యని వ్యక్తులు చెరువులో విషప్రయోగం చేయడంతో సుమారు రెండు క్వింటాళ్ల చేపలు మృత్యువాతపడ్డాయి. సుమారు లక్ష రూపాయల ఆస్తినష్టం సంభవించిందని బలరాం ఆవేదన వ్యక్తం చేశాడు. ఏడాది పాటు చెరువులో చేపలు పెంచుతున్నానని బుధవారం చెరువు వద్దకు వెళ్లి చూడగా చేపలన్నీ మృతి చెందాయన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్సై మోహన్ చెరువు వద్దకు వెళ్లి మృతి చెందిన చేపలను పరిశీలించారు.

జీవ వైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలి


ఆసిఫాబాద్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

ఆసిఫాబాద్, మార్చి 22: జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషిచేయాలని డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, రెబ్బెనఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శ్రీధరాచారి అన్నారు. బుధవారం జీవవైవిధ్య దినోత్సవంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవవైవిధ్య రక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతో పాటు అటవీసంరక్షణలో తమతో కలిసిరావాలన్నారు. అడవులు, జంతువులను సంరక్షించినప్పుడే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత సంవత్సరం 48నుంచి 50డిగ్రీలవరకు వేసవితాపం చేరిందంటే దానికి పర్యావరణ సమతుల్యం లేకపోవడమే కారణమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీరేంజ్ అధికారులు సరోజరాణి, సెక్షన్ అధికారులుసత్యనారాయణ, లక్ష్మణ్, సతీష్, కోమల్, బీట్ అధికారులు రాజేష్, రజిత, విద్య, ఉమారాణి, స్వప్న, కిశోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని మోడి గ్రామంలో రైతులు, చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతిఒక్కరు జీవవైవిధ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్, మాజీసర్పంచ్ నానేశ్వర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో మొక్కను నాటుతున్న ఎఫ్‌డీవో అప్పలకొండ

కాగజ్‌నగర్: పట్టణంలో బుధవారం బయోడైవర్సిటీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీఅధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఫారెస్టు కార్యాలయంలో ఎఫ్‌డీవోఅప్పలకొండ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆసిఫాబాద్, మే 22: ఆసిఫాబాద్ మండలం సందీప్‌నగర్ గోండుగూడకాలనీకి చెందిన క్రుసంగే సాయికుమార్(30) మంగళవారంరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ సతీష్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ కొన్నిరోజుల నుంచి సరిగ్గా పని చేయడం లేదు. రోజు తాగి వస్తుండేవాడు. ఈ విషయంలో బుధవారం రాత్రి తల్లి మందలించడంతో మనస్థాపానికి గురై ఇంట్లో దులానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి గంగుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్సీ

సిర్పూర్(టి), మే 22:మండలకేంద్రంలో ఎమ్మెల్సీ దండెవిఠల్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో సమావేశమయ్యారు. స్థానికసంస్థలఎన్నికలు, తదితరాలపై సమీక్షించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కిశోర్, రాణాప్రతాప్ సింగ్ తదితరులు ఉన్నారు.

కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా


ఖాళీగా ఉన్న కుర్చీలు

కౌటాల, మే 22: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విశ్వనాథ్ అధ్యక్షతన బుధవారం జరగాల్సి ఉండగా ఎంపీపీతో సహా ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. ఎంపీటీసీ మోతీరాం తప్ప మిగితా వారు హాజరు కాలేదు. దీంతో మధ్యాహ్న 12.10వరకు ఎవరు రాని కారణంగా సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు, తదుపరి ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిర్పూర్(టి), మే 22: మండలంలోని పెద్దబండ నుంచి లోనవెల్లి సబ్‌స్టేషన్ వరకు 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కౌటాల,సిర్పూర్(టి), చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల్లో ఉదయం 8.30 నుంచి 11.30గంటలవరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ ఒకప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించా లని కోరారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

బెజ్జూరు, మే 22: కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ దినపత్రికలో పనిచేస్తున్న విలేకరి తిరుపతిపై దాడిచేసిన దుండగులను వెంటనే శిక్షించాలని కోరుతూ బుధవారం బెజ్జూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు.

పాఠశాలలు ప్రారంభంలోగా మరమ్మతులు పూర్తి చేయాలి

● డీఆర్డీవో సురేందర్

బెజ్జూరు, మే 22: పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా అమ్మఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులను పూర్తిచేయాలని డీఆర్డీవో సురేందర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో స్వయం సహాయకసంఘాలతో మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా అన్ని రకాల పనులు పూర్తిచేయాలన్నారు. అదే విధంగా స్వయం సహాయకసంఘాలకు ఉపాధి కల్పించేందుకు ఏకరూప దుస్తులు కుట్టిన వారికి తక్షణమే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలకేంద్రంలో పశుగ్రాసం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనవెంట ఏపీడీ రామకృష్ణ, డీపీఎం అన్నాజీ, ఎంపీవో రమేష్‌రెడ్డి, ఏపీఎం మోహన్‌లాల్, సీసీలు భద్రయ్య, పద్మ, భగవాన్, జిల్లాసమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు ఉన్నారు.

ఈదురుగాలులు.. వర్షం


సిర్పూర్(యు)లో కురుస్తున్న వర్షం

సిర్పూర్(యు), మే 22: మండలంలో బుధవారం ఈదురుగాలులతోకూడిన వర్షం పడింది. పగటిపూట ఎండలు దంచికొట్టగా సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈదురుగాలులు బలంగా వీచడంతో ఆక్కడ క్కడా చెట్లు కూలిపోయాయి. గంటసేపు వర్షం పడింది.

ఎండ దెబ్బకు.. పశువులు చెట్టు నీడకు

కెరమెరి, మే 22: భానుడి ప్రతాపానికి పశువులు ఎండ నుంచి తమను తాము రక్షించుకోవడానికి చెట్టునీడలో సేదతీరాయి. ఉదయం మేతకు వెళ్లిన పశువులు మధ్యాహ్నం ఎండ వేడికి తాళలేక చెట్టు నీడన సేద తీరాయి. ఈ దృశ్యం కోలాం కోటారి గ్రామంలో చోటుచేసుకుంది.


చెట్టు నీడన సేద తీరుతున్న పశువులు



స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పకడ్బందీ భద్రత



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

హాజీపూర్, మే 22: లోక్‌సభ ఎన్నికలు ఈ నెల 13న జరిగిన నేపథ్యంలో జూన్ 4న కౌంటింగ్ ఉన్నందున స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంల రక్షణ కోసం పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్‌రూం వద్ద భద్రద ఏర్పాట్లు, కంట్రోల్ రూమ్‌లను జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని, 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మంచిర్యాల వద్ద గోదావరిపై హై లెవల్ వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

బ్రిడ్జి నిర్మాణం ఎక్కడ..?

- వంతెన నిర్మాణానికి రెండు స్థలాలు అనువైనవే
- ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ పరిశీలనలో వెల్లడి
- ముల్కల్ల వద్ద గోదావరిపై అంచనా వ్యయం అధికం
- పాత స్థలమే యోగ్యమంటున్న స్థానికులు

మంచిర్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల వద్ద గోదావరి నదిపై హై లెవల్ వంతెన నిర్మాణానికి ఆటంకాలు ఎదరవుతూనే ఉన్నాయి. గతంలో బీఆర్ఎస్ సర్కారు పరిపాలనా బ్రిడ్జి నిర్మాణానికి అంచనా వ్యయం రూ. 164 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం జరగడం లేదు. ఏడాది క్రితం కేవలం సాయిల్ టెస్ట్ వరకే పనులు చేపట్టగా, అంతకు మించి అడుగులు ముందుకు పడలేదు. దీంతో ప్రజల దశాబ్దాల కల కళగానే మిగిలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా కేంద్రంలో గోదావరి నదిపై మంచిర్యా ల-అంతర్గాం వంతెన నిర్మించాలని ప్రజల డిమాండ్ మేరకు అప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు కృషితో బీఆర్ఎస్ సర్కారు పచ్చజెండా ఊపింది. జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు, పెద్దపెల్లి జిల్లా అంతర్గాంల మధ్య రెండు జిల్లాలను కలుపుతూ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణించాలని ఐదు సంవత్సరాల క్రితం ప్రతి పాదించారు. వంతెన నిర్మాణం పూర్తయితే రెండు జిల్లా మధ్య రాకపోకలు సులువుగా మారడం తోపాటు ప్రజలకు దూరభారం గణనీయంగా తగ్గనుందని ఈ ప్రతిపాదన చేశారు.

నాలుగేళ్లకు ముహూర్తం..

గోదావరిపై వంతెన నిర్మించనున్నట్లు 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సీఎం హోదాలో జిల్లాకు వచ్చిన కేసీఆర్ గోదావరిపై రూ. 125 కోట్లతో వంతెన నిర్మిస్తామని, బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మంచి ర్యాల-పెద్దపల్లి మధ్య 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని...తెల్లవారే మంజూరు చేసి, వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు జీవో 170 పేరిట పరిపాలనా పరమైన ఉత్తర్వులు కూడా జారీ చేశారు. సీఎం హామీ ఇవ్వడంతో ఉరుకులు పరుగులతో అధికారులు సర్వే సైతం జరిపారు. 2019 మార్చి 30న ఆర్అండ్‌బీ సీఈ రవీంధర్ రావు బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. సర్వే పూర్తికాగానే పనులు ప్రారంభించి ఏడాది లోపు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అయితే నాలుగు సంవత్సరాల తరువాత ఎట్టకేలకు మోక్షం లభించగా గత ఏడాది జూన్ 9న కలెక్టరేట్ నిర్మాణానికి హాజరైన కేసీఆర్ వంతెనకు శంకుస్థాపన చేశారు.

నిలిచిపోయిన వంతెన పనులు..

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంతెన పనులు నిలిచిపోయాయి. డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) ప్రకారం రూ. 164 కోట్ల అంచనా వ్యయంతో వంతెన నిర్మాణంతోపాటు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు కాకుండా 1.4 కిలో మీటర్లు. వెడల్పు 12 మీటర్లు నిర్మించాల్సి ఉంది. 37 పిల్లర్లు నిర్మించనుండగా విజయ వాడలోని వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. కాగా వంతెన నిర్మాణానికి సంవత్సరంన్నర క్రితం సాయిల్ టెస్టింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించే తరుణంలో పరిస్థితులు తారుమారయ్యాయి.

స్థలాన్ని పరిశీలించిన ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ..

మంచిర్యాల ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రేంసాగర్‌రావు ప్రతిపాదించిన స్థలంలో వంతెన నిర్మాణానికి సుముఖంగా లేరు. నిర్ణయించిన స్థలంలో వంతెన నిర్మాణం చేపడితే భారీ వాహనాల రాకపోకల కారణంగా పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని ఆయన అభిప్రాయం. మరో వైపు కాలేజీ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఆ ప్రాంతం వంతెన నిర్మాణానికి పనికి రాదని చెబుతున్నారు. దీనికి బదులుగా హాజీపూర్ మండలం ముల్కల్ల వాగు సమీపంలో వంతెన నిర్మాణం చేపట్టాలని సూచనప్రాయంగా చెబుతున్నారు. దీంతో స్థల పరిశీలనకు అర్అండ్‌బీ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ పది రోజుల క్రితం రెండు చోట్లా స్థలాలను పరిశిలించారు. రెండు స్థలాలు వం తెన నిర్మాణానికి అనువుగా ఉన్నట్లు గుర్తించిన ఆయన ప్రభుత్వానికి నివేదిక అందజేయ నున్నారు. ఇదిలా ఉండగా కాలేజి రోడ్డులో వంతెన నిర్మిస్తే రూ. 164 కోట్లతో పోయేది. ముల్కల్ల వద్ద నిర్మాణంతో అంచనా వ్యయం రూ. 400 పైచిలుకు కోట్లకు చేరుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముల్కల్ల వద్ద నిర్మాణానికి పెద్ద మొత్తంలో భూ సేకరణ చేపట్టవలసి వస్తుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కాలేజీ రోడ్డులోనే వంతెన నిర్మాణం చేపట్టి, వేంపల్లి గ్రామ శివారు నుంచి బ్రిడ్జి వరకు బై పాస్ రోడ్డు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మొదట గుర్తించిన స్థలానికి, రెండోసారి ప్రతిపాదించిన స్థలానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. రెండు స్థలాలు అనుకూలంగానే ఉన్నాయని, ప్రజల అభిష్టం మేరకు పనులు చేపడుతామని అధికారులు చెబుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం జరిగితే..

బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మంచిర్యాల- పెద్దపల్లి జిల్లాల మధ్య భారీగా దూరభారం తగ్గేది. మంచిర్యాల నుంచి ప్రజలు శ్రీరాంపూర్, గోదావరిఖని మీదుగా పెద్దపల్లికి వెళ్తున్నారు. మంచిర్యాల నుంచి పెద్దపెల్లికి వెళ్లేందుకు దాదాపు 56 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. మంచిర్యాల వద్ద గోదావరిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మిస్తే రామ గుండం మండలం అంతర్గాం, బసంత్‌నగర్ మీదుగా నేరుగా పెద్దపల్లికి చేరుకోవచ్చు. తద్వారా సుమారు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అలాగే అంతర్గాం, రామగుండం వెళ్లాలంటే ప్రస్తుతం గోదావరిఖని మీదుగా 30 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. గోదావరి మీదుగా వెళ్తే మంచిర్యాల, అంతర్గాం మధ్య దూరం కేవలం ఆరు కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. బ్రిడ్జి నిర్మాణం వల్ల జిల్లా వాసులకేగాక ఆసిఫాబాద్, మహారాష్ట్రలోని చంద్రాపూర్, రాజుర ప్రజలకు ఉపయోగకరంగా ఉం టుంది. ముఖ్యంగా మంచిర్యాల, ఆసిఫాబాద్ ప్రాంతవాసులు వైద్య చికిత్సల కోసం తరుచుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లేందుకు దూరభారం తగ్గుతుంది.



సాయిల్ టెస్ట్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలి

జైపూర్, మే 22: చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించేందుకు కార్యదర్శులు చర్యలు సుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని ముదిగుంట, జైపూర్ గ్రామపంచాయతీలను బుధవారం సందర్శించి గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌లను సందర్శించి కంపోస్టు పిట్‌లో కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. కంపోస్టు పిట్ నందు వానపాములు బతికి ఉండేలా చూడాలని సూచించారు. కంపోస్టు ఎరువును నర్సరీ, పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలకు వినియోగించాలన్నారు. కంపోస్టు ఎరువు తయారీ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని చెప్పారు. పారిశుధ్య పనులను పరిశీలించి రోడ్లపై చెత్తా, చెదారం, ప్లాస్టిక్ లేకుండా శుభ్రంగా ఉంచాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అనిల్‌కుమార్, కార్యదర్శులు సురేష్, ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

'దాడులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలి

చెన్నూరు, మే 22: ఇటీవల చెన్నూరు మండలంలోని సుద్దాల, కంచనపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లల్లో అక్రమంగా చొరబడి కుటుంబ సభ్యులపై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్ కోరారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐకి కేసు నమోదు చేయాలని విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. భవిష్యత్‌లు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రామ్‌లాల్‌గిల్డా, ఎంపీపీ మంత్రి బాపు, కౌన్సిలర్ రేవెల్లి మహేష్, అనిల్, శ్రీనివాస్, మహిళ నాయకురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సన్న బియ్యం అందించేందుకే ప్రోత్సాహం

జైపూర్, మే 22: రాష్ట్రంలో మిడ్‌డే మీల్స్, గురుకుల హాస్టల్లు, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కోసమే సన్నవడ్ల సాగుకు రూ. 500 బోనస్ ప్రోత్సహకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోవడంతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సేకరించిన ధాన్యానికి మూడు రోజుల్లోపే ప్రతి రైతుకు వారి ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమవుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను విస్మరించిందని, పాఠశాల, సాంకేతిక ఉన్నత నైపుణ్య విద్యను కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందన్నారు. గత పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ వరి పండిస్తే రైతుకు ఉరేనని పేర్కొన్నారని, అదే బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతుల కోసం మాట్లాడడం హాస్యస్పదంగా ఉందన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ రైతుల కోసం ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజ్, మంతెన లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

మంచిర్యాల కలెక్టరేట్, మే 22: జిల్లాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల మేరకు రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 286 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 15,839 మంది రైతుల నుంచి 1,05,026 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసి 122 కోట్ల 3 లక్షల రూపాయలను సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, నీటి సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైసుమిల్లులకు కేటాయిస్తున్నామని తెలిపారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

హాజీపూర్, మే 22 : పడ్తన్‌పల్లి సొసైటీలో అందుబాటులో సబ్సిడీపై పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశు సంపదను కాపాడుకోవాలి

- డాక్టర్ వై రమేశ్‌కుమార్

దండేపల్లి, మే 22: రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధంగా పాడి పశువులను కాపాడుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వై రమేశ్‌కుమార్ అన్నారు. దండేపల్లిలో ప్రాథమిక పశు వైద్యశాల కేంద్రాన్ని బుధ వారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు గాలికుంటు వ్యాధి, గుండెవాపు, గొర్రెలకు చిటు రోగం వ్యాపిస్తాయన్నారు సీజనల్ వ్యాధిల పట్ల పశుపోషకులు వ్యాధి నిరోధక టికాలను వేయించాలని సూచించారు. ఆయన వెంట మండల పశువైద్యధికారి ధనరాజ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ రిటైర్‌మెంట్ కార్మిక సంఘం కార్యవర్గం

మంచిర్యాల కలెక్టరేట్, మే 22: ఆర్టీసీ రిటైర్‌మెంట్ కార్మిక సంఘం కమిటీని బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఎన్నుకున్నారు. రీజనల్ గౌరవాధ్యక్షుడిగా కలవేన శంకర్, అధ్యక్షుడిగా గుండ చంద్రమాణిక్యం, కార్యదర్శిగా రెడ్డి, కోశాధికారిగా ముబారక్, రాష్ట్ర కమిటీ నాయకునిగా ప్రకాష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి దాను తదితరులు పాల్గొన్నారు.

ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

దండేపల్లి, మే 22: ఆటో ట్రాలీ కాలువలో బోల్తా పడిన ప్రమాదంలో మృతి చెందిన బంగారు మల్లవ్వ కుటుంబానికి రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. మృతి చెందిన బంగారు మల్లవ్వ కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ పసర్తి అనిల్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోళ్ళ రాజమల్లు, బొమ్మెన మహేష్, బొలిశెట్టి రమేష్, ఆకిల్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ చెల్లించాలి

- నల్లబ్యాడ్జీలు ధరించి బీజేపీ నాయకుల నిరసన



హాజీపూర్‌లో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

హాజీపూర్, మే 22: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ముంచినట్లే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీల పేరుతో రైతులను నట్టేట ముంచుతుందన్నారు. వెంటనే బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం స్వామిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటరమణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, నాయకులు సత్యం, ప్రశాంత్, మల్లేష్, ధర్మయ్య, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, రాజనర్సు, తిరుపతి, సతీష్, స్వామి,ప్రతాప్ పాల్గొన్నారు.

దండేపల్లి: దొడ్డు వరిధాన్యం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చెల్లించాలని బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సంధ్యరాణికి రైతులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, కిషన్ మోర్చా మండల అధ్యక్షుడు వనపర్తి రాకేష్, నాయకులు సురేష్,సురేందర్, శ్రీనివాస్, రవీందర్, కిషన్, రమణయ్య, సత్తయ్య, అశోక్, శ్రీనివాస్, మల్లేష్, రాయమల్లు, రమేష్, రాజన్న పాల్గొన్నారు.

చెన్నూరు: రాష్ట్రంలోని రైతులు పండించిన అన్నిరకాల వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 బోనస్ చెల్లించాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్ కోరారు. బుధవారం చెన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జైపూర్: దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ వనజారెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దుగుట రాజ్‌కుమార్, వేముల తిరుపతిగౌడ్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భీమారం: రాష్ట్ర ప్రభుత్వం రైతుల దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాలని భీమారంలోని కొనుగోలు కేంద్రం వద్ద బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాపు, శ్రీనివాస్, దుషాంత్‌యాదవ్, సతీ ష్, శంకర్, రాములు, విజయ, వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: బీజేపీ నాయ కులు తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల కృష్ణదేవరాయలు, కార్యవర్గ సభ్యులు కేశెట్టి విజయ్‌కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: అన్నిరకాల వడ్లకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ ఇస్తామనడాన్ని నిరసిస్తూ బుధవారం బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపూఆరు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్, మండల ప్రధాన కార్యదర్శి ప్రసన్న, బాలరాజు, కిరణ్, శంకర్, శ్రీనివాస్, బాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాలని వేమనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి ఏనుముల వెంకటేష్, నాయకులు పుల్లయ్య, అంజి, లస్మయ్య, సుధాకర్, శ్రీకాంత్, మధునయ్య, గోపాల్, సంతోష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

క్రీడా శిక్షణ శిబిరం ముగింపు

శ్రీరాంపూర్, మే 22: శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 25 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీజీఎం(పర్సనల్) పి. అరవిందరావు హాజరయ్యారు. శిబిరంలో నేర్చుకున్న ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్ బాల్ ఆటలను నిత్య జీవితంలో సాధన చేస్తూ ఉండాలని సూచించారు. అనంతరం బాలబాలికలకు టీషర్ట్‌లు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్ వైజర్ చాట్ల అశోక్ పాల్గొన్నారు.

పనిభారం..నిధుల కొరత

- పడకేసిన పల్లె పాలన
- కార్యదర్శులు ఉక్కిరిబిక్కిరి
- చేతులెత్తేస్తున్న ప్రత్యేకాధికారులు



జైపూర్, మే 22: గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం స్పెషల్ అధికారులను నియమించింది. వారికి నిధులు విధుల కేటాయింపు విషయంలో స్పష్టత లేకపోవడంతో పల్లె పాలన పడకేసింది. దీంతో గ్రామపంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం కరెంటు బల్బులు, బోరు మరమ్మతులు, ట్రాక్టర్‌లకు డీజిల్ కొనలేని పరిస్థితి ఏర్పడింది. మల్టీ పర్పస్ వర్కర్లకు నాలుగు నెలలుగా జీతాలు కరువయ్యాయి. ఈ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతుంది. ఉదయం 7 గంటలకు విధుల్లో చేరితే రాత్రి ఏ పదింటికో కానీ పనులు పూర్తవడం లేదు. వారి విధులకు హరితహారం, ఉపాధి పథకం నిర్వహణ, రేషన్ బియ్యం పంపిణీకి బయోమెట్రిక్ నమోదు, పల్లె ప్రగతి పనులు, పన్నుల వసూళ్లు, జనణ, మరణాల పేర్లు నమోదు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ ధృవపత్రాల జారీ లాంటి పనులు తోడవడంతో పంచా యతీ కార్యదర్శులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఉదయం 7 గంటలకు పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు 8 గంటలలోపు డీఎస్ఆర్ అటెండెన్స్ ఇచ్చి పది గంటల లోపు డీఎస్ఆర్ పూర్తి చేయాలనే నిబంధనలతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

- జిల్లాలో ఇలా..

జిల్లాలో 311 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రతి గ్రామాని కీ ఒక కార్యదర్శిని నియమించింది. ఈ ఏడాది జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి స్పెషల్ అధికారుల పాలన మొదలైంది. క్లస్టర్ గ్రామాలుగా ఎంపిక చేసి 264 మంది ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. స్పెషల్ ఆఫీసర్లకు నిధులు, విధులపై స్పష్టత లేకపోవడంతో రావ డం, పోవడం తప్ప చేసిందేమి లేకపోవడంతో కార్యదర్శులకే పనిభారం అవుతుంది. స్పెషల్ ఆఫీసర్‌లు చేతులెత్తేయడంతో కార్యదర్శులు అప్పులు చేసి కనీస అవసరాలు తీర్చేందుకు నానా తంటాలు పడుతున్నారు.పెద్ద గ్రామపంచాయతీలు కొంత నయంగా ఉన్నా వెయ్యిలోపు జనాభా ఉన్న పంచాయతీల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని చెబుతున్నారు.

- తప్పని తిప్పలు..

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ ఇచ్చే నిధులు ముఖ్యమైన ఆర్థిక ఆధారాలు కాగా 2022 ఆగస్టు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రఆవడం లేదు. ఇక జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ. 812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. ప్రత్యేక పాలన ప్రారంభమైనప్పటి నుంచి ఇవి కూడా రావడం లేదు. ఇక పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్నులు, లైబజార్, గృహ నిర్మాణ ఫీజులు, వ్యాపార వాణిజ్య లైసెన్స్‌ల ఫీజుల రూపేణా కొంత ఆదాయం సమకూరుతుంది. కానీ చిన్న గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు తప్ప ఎలాంటి ఇతర ఆధారాలు లేవు. స్పెషల్ ఆఫీసర్లు కనీసం పంచాయతీల వైపు తొంగి చూడకపో వడంతో కార్యదర్శులపై భారం పడుతుంది. ఒక్కో కార్యదర్శి పంచాయతీ నిర్వహణకు 4 నెలల కాలంలో రూ. 30 వేల నుంచి 40 వేల వరకు అప్పులు చేసిన ట్లు తెలిపారు. గతంలో గ్రామాల్లో చెత్త సేకరణకు కొనుగోలు చేసిన ట్రాక్టర్లు , ఆటోలు పంచాయతీ కార్యదర్శుల పేరిట రిజిస్ట్రేషన్‌లు అయ్యాయి. ఈఎంఐ కట్టకపోతే వారి సొంత బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సిబిల్ స్కోరు పడి పోతుందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచు ఎన్నికలు జరిగే వరకు ఎలా నెట్టుకొచ్చేదని కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారం తగ్గించాలి..



ఏ ప్రభుత్వ ఉద్యోగులకు లేనన్నీ నిబంధనలు పంచాయతీ కార్యదర్శుల కు ఉండ డంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాం. పనిభారంతో పాటు సొంతంగా బిల్లులు చెల్లించే బాధ్యతలను తప్పించాలి. ట్రాక్టర్‌లు, ఇతర రవాణా వాహనాల నిర్వహణకు ఖర్చుకు సంబంధించిన బిల్లులు చెల్లించే బాధ్యతలను కార్యదర్శులపై మోపడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. డీఎస్ఆర్ యాప్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పంచాయతీల్లో నిధులు లేక మల్టీ పర్పస్ కార్మికుల వేతనాలు చెల్లించే పరిస్థితి లేదు.

- చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు